అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
సోమవారం 24 ఏప్రిల్ 2023

మొబైల్‌ను వీడి.. క్రీడలు ఆడాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

వేసవిలో పిల్లలందరూ ఇంట్లో టీవీ, మొబైల్ ఫోన్‌లలో గేమ్స్ ఆడటం మాని, క్రీడా పోటీల్లో పాల్గొవాలని డిచ్‌పల్లి సీఐ కృష్ణ సూచించారు. ఆదివారం డిచ్‌పల్లి మండలంలోని ఘనపూర్ ప్రీమియం లీగ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వేసవి సెలవుల్లో ఉదయం, సాయంత్రం వేళ పిల్లలతో ఆటలు ఆడించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఘన్‌పూర్ యువత వినూత్నగా ఆలోచించి యువకులందరిని ఎంగేజ్ చేయడానికి ఘనపూర్ ప్రీమియం లీగ్ నిర్వహించడం చాలా సంతోషమన్నారు.కార్యక్రమంలో ఎస్ఐ కచ్చుకాయల గణేశ్, కుర్రి రామకృష్ణ, సతీష్ రెడ్డి, గ్రామభివృద్ధి కమిటీ సభ్యులు, జీపీఎల్ టీమ్ క్యాప్టెన్స్ దాస్, సాయినాథ్, ఓం ప్రసాద్, హరీష్, సాగర్, గవస్కర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు కరెంట్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-మద్నూర్



33 కేవీ మద్నూర్ ఫీడర్ లైన్ మరమ్మతుల కోసం నేడు(24వ తేదీ సోమవారం) ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ అరవింద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్నూర్, మెనూర్, అలాగే డోంగ్లి సబ్ స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్‌సరఫరాలో అంతరాయం కలగనున్నట్టు తెలిపారు. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

సర్పంచుల కుతకుత

- నెలల తరబడి బిల్లులు పెండింగ్
- రాష్ట్ర సర్కారుపై తీవ్ర ఆగ్రహం
- ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధమవుతున్న వైనం
- 30 తేదీ వరకు డెడ్‌లైన్

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టరేట్‌లో నందిపేట్ సర్పంచ్ దంపతుల ఆత్మహత్యాయత్నం(ఫైల్)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై బీఆర్ఎస్ సర్పంచులు కుతకుతలాడుతున్నారు. అప్పులు చేసి గ్రామాలభివృద్ధి చేస్తే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయడం లేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 30వ తేదీ వరకు నిధులు విడుదల చేయకపోతే ప్రత్యక్ష ఆందోళనలకు సిద్ధమవుతామని రాష్ట్ర సర్కారుకు అల్టిమేటం జారీ చేస్తున్నారు. ఈ మేరకు నిజామాబాద్ జిల్లాలో ఇప్పటికే నిరసన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఇటీవల జిల్లా కలెక్టర్‌ను కలిసి 16 డిమాండ్ అంశాలతో వినతిపత్రం సమర్పించారు. మార్చి 2022 నుంచి ఏప్రిల్ 2023 వరకు 15వ ఫైనాన్స్ కమిషన్ నుంచి కేవలం ఒక్కసారి మాత్రమే నిధులు విడుదలయ్యాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికే చాలా మంది సర్పంచులు లక్షల అప్పుల్లో కూరుకుపోయాయి. ఉపర్ షేర్వానీ అందర్ పరేషానీ అన్నట్టుగా సర్పంచుల పరిస్థితి తయారయ్యింది.

నిజామాబాద్ జిల్లాలో మొత్తం 530 పంచాయతీలు న్నాయి. కామారెడ్డిలో 526 పంచాయతీలున్నాయి. ఒక్క నిజామాబాద్ జిల్లాలోని పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సుమారు 80 కోట్ల నిధులు రావాల్సి ఉంది. చిన్న చిన్న పంచాయతీలకు సైతం పది లక్షల వరకు నిధులు పెండింగ్ ఉండటం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రగతి, వైకుంఠధామాలు, ప్రకృతి వనాలు, కంపోస్ట్ షెడ్లు అంటూ హడావుడిగా కార్యక్రమాలు ప్రకటించడం, ఆ పనులు సర్పంచులతో చేయించడం ఆనవాయితీగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం ఎలాగైనా బిల్లులు మంజూరు అవుతాయని భావించి చాలా మంది సర్పంచులు లక్షలు బాకీలు తీసుకొచ్చి మరీ పనులు చేపట్టారు. కానీ నెలలు పూర్తవుతున్నా పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు కావడం లేదు. ఫలితంగా సర్పంచులు ప్రస్తుతం తీవ్ర అప్పుల్లో కూరుకుపోయారు. పరిస్థితి ఎలా ఉందంటే సర్పంచు తలెత్తుకుని పంచాయతీలో కూర్చోలేకపోతున్నారు. 2019-2020లో వచ్చిన నిధులతో పోలిస్తే 2020-2021, 2021-22, 2022-23 వరకు 60 శాతం మాత్రమే నిధులు విడుదలయ్యాయి. ఇక నిధుల ఫ్రీజింగ్ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. చెక్కులు ఆరు నెలలు అయినా క్లియర్ కావడం లేదు. చివరకు పంచాయతీ కార్మికులకు వేతనాలు సైతం సర్పంచుల జేబులో నుంచి చెల్లిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలు నిర్మించాలని ఒత్తిడి చేసింది. జిల్లాలో దాదాపు 90 శాతం పంచాయతీల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు అయ్యాయి. క్రీడా ప్రాంగణాల్లో మొరం పోసి చదును చేశారు. మైదానం బోర్డులు ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటి వరకు బిల్లులు మంజూరు కాలేదు. ఇక ఎప్పుడైనా బిల్లులు వచ్చినా రాష్ట్ర సర్కారు కరెంటు బిల్లుల కింద జమ చేసుకుంటోంది. ఇటీవల నిజామాబాద్ జిల్లాలోని పంచాయతీలకు రూ.3 కోట్లు విడుదల అయితే అవన్నీ కరెంటు బిల్లుల కిందజమ చేసుకుంది. వీటన్నింటికి తోడు ట్రాక్టరు ఇఎంఐ చెల్లించుడు సర్పంచులకు తలకు మించిన భారమవుతోంది. చాలా పంచాయతీల్లో సకాలంలో బిల్లులు చెల్లించక సర్పంచుల సిబిల్ స్కోరు పడిపోతోంది. ట్రాక్టర్‌లను సర్పంచుల ఆధారు, పాను కార్డుల నెంబర్ల ఆధారంగా కొనుగోలు చేశారు. పంచాయతీల్లో అభివృద్ధి అనేది లేకుండా పోయింది. గ్రామంలో హరితహారం ప్రోగ్రాంలో చెట్లకు ట్రీ గార్డులు, కట్టెలకు కూడా నిధులు సరిపోవట్లేదు. పాఠశాల నిర్వహణను గ్రామ పంచాయతీ పరిధిలో నుండి తీసివేయాలని సర్పంచులు డిమాండ్ చేస్తున్నారు. ఇక అధికారుల ఒత్తిడితో మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా చేసిన పనులకు నిధులు రాలేదు. విటన్నింటిపై సర్పంచులు ప్రత్యక్ష పోరాటాలకు సమాయత్తమవుతున్నారు. ఈ నెల 30వ తేదీ వరకు అల్టిమేటం విధించారు.

ప్రత్యక్ష ఆందోళన చేస్తాం

శ్రీనివాస్. నిజామాబాద్ జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు

పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర నిధులు రావడం లేదు. సమస్యలు చాలా పెరిగిపోతున్నాయి. మౌలిక వసతులు అందించలేని స్థితికి వచ్చాం. స్వంత డబ్బులతో పాలన చేస్తున్నాం. మేం అప్పులు చేసి అభివృద్ధి చేశాం. కానీ ఒక్క రూపాయి రావడం లేదు. ఈనెల 30వ తేదీ వరకు బిల్లులు విడుదల చేయాలి. లేకపోతే 1వ తేదీ నుంచి జిల్లావ్యాప్తంగా సర్పంచుల ఏకమై పోరాట ప్రణాళిక సిద్ధం చేసుకుని ఆందోళనకు దిగుతాం. ఇప్పటికే జిల్లా కలెక్టరుకు రాతపూర్వకంగా వినతిపత్రం ఇచ్చాం.

మరమ్మతులు, డస్ట్‌బిన్లకు
విద్యార్థుల నుంచే వసూళ్లు

- దయనీయంగా గురుకులాల పరిస్థితి

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



జిల్లాలో బీసీ గురుకులాల పరిస్థితి అధ్వాన్నంగా తయారయ్యింది. గురుకులాల్లో కనీస వసతులకు నిధులు కరువయ్యాయి. ఫలితంగా ఏదైనా మరమ్మతు జరిగినా, గురుకులాలకు ఏమైనా అవసరమైనా విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్నారు. ఒక్కో విద్యార్థి గురుకులాల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవల ఈ విషయమై ధర్మారం గురుకులంలో విద్యార్థి తండ్రికి, ప్రధానోపాధ్యాయుడికి వాగ్వాదం జరిగింది. ఆ గురుకులంలో గేటు మరమ్మతు కోసం విద్యార్థి ఏకంగా మూడు వందల వరకు అప్పు చేసినట్టు సమాచారం.

నిజామాబాద్ జిల్లాలో మొత్తం 12 గురుకుల పాఠశాలలు న్నాయి. ఒక గురుకుల జూనియర్ కాలేజ్ ఉంది. గురుకులాల నిర్వహణ కోసం స్వంత భవనాలు ఉంటే సర్కారు ప్రతియేటా రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు నిధులు ఇస్తోంది. ఇక అద్దె భవనాల్లో ఉంటే మాత్రం అద్దె చెల్లిస్తోంది. ఈ అద్దె భవనాల నిర్వహణ యజమాని చూసుకోవాల్సి ఉంటోంది. కానీ జిల్లాలో కొన్ని గురుకులాల్లో డస్ట్‌బిన్‌కు, గేట్లు మరమ్మతుల కోసం విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. ఈ విషయంపై స్వయంగా విద్యార్థి తండ్రి ప్రిన్సిపాల్‌ను నిలదీశాడు. తమ కుమారుడు తప్పు చేయనప్పుడు ఎలా వసూలు చేస్తారని అడిగారు. పైగా ఇదే గురుకులంలో డస్ట్‌బిన్ల కోసం కోసం కూడా డబ్బు అడిగినట్టు తెలిసింది. అయితే గురుకులాల్లో ఏ విద్యార్థి అయినా ఉద్దేశపూర్వకంగా గురుకులాల్లో ఉన్న వస్తువులకు నష్టం చేస్తే సంబంధిత విద్యార్థి నుంచి ఆ నష్టపరిహారం వసూలు చేయడం మొదటి నుంచి ఉంది. ఆ విద్యార్థి మరోసారి ఆ తప్పు చేయబోడని ఈ నిబంధన తీసుకొచ్చారు. కానీ దాన్ని సాకుగా చూపి గురుకులాల్లో అవసరమైన చిన్న చిన్న వస్తువులకు, మరమ్మతులకు విద్యార్థుల నుంచి వసూలు చేయడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై బీసీ గురుకులాల రీజియన్ కోఆర్డినేటర్ సత్యనాథ్‌రెడ్డిని వివరణ కోరగా.. ఈ అంశంపై విచారణ చేపడతానని నవతెలంగాణతో చెప్పారు. ఒకవేళ తప్పు చేసిన విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేయాలని నిర్ణయించినా.. ముందుగా స్టాఫ్ మీటింగ్ ఏర్పాటు చేసుకుని తీర్మానం చేయాల్సి ఉంటుందని వివరించారు. ధర్మారం గురుకులానికి సంబంధించి ఇలాంటి అంశం తన దృష్టికి రాలేదని వివరించారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని అన్నారు.

నలుగురిపై అట్రాసిటీ కేసు నమోదు

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండలంలోని పుల్కల్ గ్రామానికి చెందిన బొట్టు శిరీష శనివారం రాత్రి తన ఇంట్లో ఫంక్షన్ నిర్వహిస్తూ ఇద్దరు ఫాస్టర్లతో కలిసి ప్రార్థన నిర్వహిస్తుండగా పుల్కల్ గ్రామానికి చెందిన సంతోష్ రెడ్డి, సాయికుమార్, శంకర్ వాజిద్ నగర్ గ్రామానికి చెందిన బండి సాయిలు అక్రమంగా వారింట్లోకి చొరబడి అన్యమత ప్రచారం ఎందుకు నిర్వహిస్తున్నారని దూషిస్తూ మైకులను ధ్వంసం చేశారని ఎస్ఐ శ్రీధర్ రెడ్డి తెలిపారు. శిరీష కుటుంబ సభ్యులను శిరీషను కులం పేరుతో దూషించినందుకు నలుగురు వ్యక్తులపై అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ప్రాణాలు పోతేగాని స్పందించరా?

- సీతారాంకాలనీలో వంగిన హెచ్‌టీ స్తంభం
- 20 రోజుల క్రితం ఫిర్యాదు.. ఇప్పటికీ చర్యలు శూన్యం

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



ఒక వైపు వంగిన స్తంభం



నిజామాబాద్ పట్టణంలో సీతారాంనగర్ కాలనీలో తుప్పుపట్టి ఒకవైపు ప్రమాదకరంగా వంగిన స్తంభాన్ని తొలగించడంలో విద్యుత్తు అధికారులు తాత్సారం చేస్తున్నారు. ఈ విషయమై కాలనీవాసులు గుర్తించి ఈ నెల 2వ తేదీన సంబంధిత లైన్‌మేన్‌కు, ఏఈకి అలాగే ఎస్ఈకి సైతం ఫిర్యాదు చేశారు. ఎస్ఈ స్పందించి ఏఈకి స్తంభం మార్చాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. కాలనీకి వచ్చిన ఏఈ, లైన్‌మేన్ తీవ్రత గమనించి రెండు రోజుల్లో మారుస్తామని ప్రకటించారు. కానీ దాదాపు 20 రోజులు కావొస్తున్నా నేటికీ స్తంభాన్ని తొలగించి నూతన స్తంభం ఏర్పాటు చేయలేదు. దీనిపై కాలనీవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాణాలు పోతేకానీ స్పందించరా? అంటూ నిలదీస్తున్నారు. దీనికితోడు రెండు రోజులుగా తీవ్రమైన ఈదురుగాలులు వీస్తుండటంతో ఏ క్షణంలో హైటెన్షన్ వైర్ల స్తంభం కిందపడి తమ ప్రాణాలుకు ముప్పు వస్తుందోనని భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బీఆర్ఎస్‌లో బీజేపీ నాయకుల చేరిక



పార్టీలో చేరిన వారికి బీఆర్ఎస్ కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని పెద్దపోతంగల్, కర్ణం గడ్డ తండాకు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి ముఖ్య అనుచరుడు శ్రీనునాయక్, పోతంగల్ రమేష్, కృష్ణా రెడ్డి, రవితో పాటు సుమారు 50 మంది యువకులు బీజేపీ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా బీఆర్ఎస్ పార్టీలోకి ఎమ్మెల్యే సురేందర్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. నియోజకవర్గ అభివృద్దే ధ్యేయంగా అహర్నిశలు పనిచేస్తున్నామని అన్నారు. ప్రతీ కార్యకర్త కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తున్నదని భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన ప్రతీ ఒక్కరు క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేసి ఎల్లారెడ్డి నియోజకవర్గం అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాధ బలరాం, జడ్పీటీసీ సభ్యులు శంకర్ నాయక్, మాజీ జడ్పీటీసీ సభ్యులు తనాజీ రావు,తదితరులు పాల్గొన్నారు.

సాంఘీక విప్లవకారుడు బసవేశ్వరుడు

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్
- ఘనంగా జయంతి వేడుకలు

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)



కలెక్టరేట్‌లో నివాళి అర్పిస్తున్న కలెక్టర్, పలువురు



నసురుల్లాబాద్‌లో..

మనుషులందరూ ఒక్కటేనని, స్త్రీ పురుష భేదం లేదని, శ్రమను మించిన సౌందర్యం లేదని, భక్తి కన్నా సత్ప్రవర్తనే ముఖ్యమని వీరశైవ సంప్రదాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన సాంఘిక విప్లవకారుడు బసవేశ్వరుడు అని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మహాత్మా బసవేశ్వరుని 890వ జయంతి వేడుకలను పురస్కరించుకుని ఆదివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదా యంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బసవేశ్వర జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బసవేశ్వర చిత్రపటానికి వీరశైవ జంగం సమాజం ప్రతినిధులు, బీసీ సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సర్వమానవ సమానత్వాన్ని ప్రబోధించిన విశ్వగురువుగా అందరి హృదయాల్లో బసవేశ్వరుడు చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. కుల, వర్ణ, వర్గ, లింగ వివక్ష లేకుండా సమసమాజ నిర్మాణం కోసం కొన్ని వందల ఏళ్ల క్రితమే బసవేశ్వరుడు కృషి చేశారన్నారు. ఆ కాలంలోనే మహిళా సాధికారత కోసం పాటుపడిన మహెూన్నతులు బసవేశ్వరుడని కొనియాడారు. ప్రతిఒక్కరూ బసవేశ్వరుడి అడుగుజాడల్లో నడవాలని చెప్పారు. బసవేశ్వరుడు గొప్ప సంఘ సంస్కర్త అని, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక మార్పులకు శ్రీకారం చుట్టిన మహెూన్నతుడని కొనియాడారు. బసవేశ్వరుని ఆచరణలు నేటికీ కొనసాగడం సంతోషకరమని, ఆయన చూపిన అడుగు జాడల్లో ప్రజలందరూ పయనించాలని అన్నారు. జయంతి వేడుకల కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులు, కౌలాస్ పీఠాధిపతి మల్లికార్జున అప్ప, జిల్లా జంగం సమాజం అధ్యక్షుడు మఠం విజయ్ కుమార్, బీసీ ప్రతినిధులు శివరాం, రాజయ్య, జై గౌడ ఉద్యమ సంఘం కల్లుగీత సంగం జిల్లా అధ్యక్షుడు చెన్నం గారి మహేష్ గౌడ్, వీరశైవ జంగం సమాజం ప్రతినిధులు ప్రభాకర్, వీరయ్య సంగప్ప, వీర మహేందర్, సుభాష్ పాల్గొన్నారు.

తాడ్వాయి : మండలం చిట్యాల గ్రామంలో ఆదివారం శ్రీ మహాత్మా బసవేశ్వరుని జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు గ్రామంలోని బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన బసవేశ్వరుని విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు గ్రామంలో వీరశైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో ప్రత్యేక బైక్ ర్యాలీ నిర్వహించారు. బసవేశ్వరుడి చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ.. మహాత్మా బసవేశ్వరుడు 12వ శతాబ్దంలో అవతరించిన గొప్ప సామాజిక విప్లవకారుడని తెలిపారు. మనుషులందరూ ఒకటేనని కులాలు ఉప కులాలు లేవని ప్రబోధించిన మహనీయుడు బసవేశ్వరుడన్నారు. ఈ కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సమాజం అధ్యక్షుడు కందిశేఖర్, ఉపాధ్యక్షుడు రమేష్, కోశాధికారి భాస్కర్, కార్యదర్శి చెంబల భాస్కర్ ఎంపీటీసీ రాజమణి రవీందర్, సర్పంచ్ మాడం కవితా బాలయ్య, ఉపసర్పంచ్ సతీష్, టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మహిపాల్, ఎస్సై ఆంజనేయులు రమేష్, మురళి ,ప్రవీణ్ కుమార్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్ : విశ్వగురువు, జగజ్యోతి, క్రాంతి పురుషుడు, లోకొద్దరకుడు బసవేశ్వరుని 890వ జయంతిని బాన్సువాడ, బీర్కూర్, నసురుల్లాబాద్ మండలాల్లో వీరశైవ లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీర్కూర్ లో బసవేశ్వరుని చిత్ర పటానికి ఆ సమాజ్ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమాజ్ సభ్యులు మాట్లాడుతూ, కుల, మత వర్గ, లింగ, బేదాలను ప్రశ్నించిన మొట్ట మొదటి సంస్కార్త, మహాత్ముడు బసవేసశ్వరు డన్నారు. ప్రభుత్వం బసవ జయంతికి సెలవు దినంగా ప్రకటించడం ఎంతో సంతోషం అని, ఇదేవిధంగా ప్రతి ఒక్కరు మున్ముందు బసవ జయంతిని కండాన్తరాలు చాటే విధంగా ప్రతి ఒక్కరు ముందుకు రావాలన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెంగాణ-నసురుల్లాబాద్



కార్యకర్త కుటుంబానికి నిర్మించి ఇచ్చిన డబుల్ బెడ్ రూం ఇల్లును ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే బలమని, ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటామని రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం నసురుల్లాబాద్ మండల కేంద్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇంటి గృహప్రవేశం ఆదివారం చేయించారు. నసురుల్లబాద్‌కు చెందిన బీఆర్ఎస్ క్రియాశీల కార్యకర్త దొంతి శంకర్ ఆకస్మికంగా మరణించగా అతని కుటుంబానికి స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి కుటుంబం అండగా నిలిచింది. అతని కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తూ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించి ఇచ్చారు. వారి కుటుంబానికి ఏ లోటు లేకుండా పోచారం కుటుంబం ముందుండి ఇల్లు కట్టించారు. చనిపోయిన కార్యకర్త కుటుంబానికి పార్టీ బీమా చెక్కు కొండత భరోసా అన్నారు. పార్టీ కార్యకర్త చనిపోతే రెండు లక్షల రూపాయల బీమా అందిస్తున్న ఏకైక పార్టీ దేశంలో బీఆర్ఎస్ ఒక్కటే అన్నారు. కార్యకర్తలు లేనిదే నాయకులు లేరనీ, ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పల కాపాడుకుంటా మన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన నుంచి నేటి వరకు బాన్సువాడ నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందు తుందని, సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను, పార్టీ సిద్ధాంతాలను ప్రతి గడపకు తీసుకెళ్లాలన్నారు. మల్లన్న సాగర్ కాల్వల ద్వారా నిజాంసాగర్ ఆయకట్టు భూములు సస్యశ్యామలం చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్ దేనన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త కంకణబద్ధులై పని చెయ్యాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో పోచారం సురేందర్ రెడ్డి, ఎంపీపీ పాల్త్యా విఠల్, పార్టీ మండల అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్, జిల్లా కో అప్షన్ మెంబర్ మజీద్, వైస్ ఎంపిపి ప్రభకర్ రెడ్డి, నాయకులు కంది మల్లేష్, లక్ష్మీనారాయణ గౌడ్, మైషగౌడ్, కలీల్, మోసిన్, లబ్దిదారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల నష్టం
45 ఎకరాలేనటా

వ్యవసాయశాఖ ప్రాథమిక నివేదిక

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



కమ్మర్‌పల్లిలో నేలవాలిన జొన్న పంట

నిజామాబాద్ జిల్లాలో వారం వ్యవధిలో రెండు రోజుల పాటు కురిసిన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షంతో కేవలం 45 ఎకరాల్లో మాత్రమే పంట నష్టం జరిగిందని వ్యవసాయ అధికారులు అంచనాలు వేశారు. అది కూడా కేవలం ఇందల్‌వాయిలోని రెండు గ్రామాల్లో మాత్రమే పంట నష్టం జరిగినట్టు ప్రాథమికంగా నివేదిక రూపొందించారు. ఈ మేరకు జిల్లా వ్యవసాయాధికారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు రోజులు పాటు కురిసిన వడగండ్ల వానవల్ల వందల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని రైతాంగం ఆవేదన చెందగా.. కేవలం రెండు గ్రామాల్లో 45 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు నివేదిక తయారు చేయడం గమనార్హం.

అకాల వర్షంతో
పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సబ్బని లత డిమాండ్



మాట్లాడుతున్న సబ్బని లత

నవతెలంగాణ-బోధన్

అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సబ్బని లత డిమాండ్ చేశారు. ఆదివారం బోధన్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత నాలుగైదు రోజుల క్రితం కురిసిన అకాల వర్షాలకు రైతుల ధాన్యం తడిసిపోవడం, వరి పంట నష్టం కావడం జరిగిందని కావున కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ధాన్యం కొనుగోలు చేసిన రెండు రోజులలో డబ్బులు రైతుల ఎకౌంట్లో వేయాలన్నారు. పొలంలోనే రాలిపోయిన వడ్లకు ఎకరానికి 20 వేల నష్టపరిహారాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే పార్టీ ఆధ్వర్యంలో రైతుల పక్షాన ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు గంగాధర్ అప్పా, పార్టీ బోధన్ ఏరియా కార్యదర్శి యేషాల గంగాధర్, బోధన్ ఏరియా కమిటీ సభ్యులు బాలయ్య, జంగం గంగాధర్, లింగం, మీరాబీ, సాయిలు ,విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో బాలుడు మృతి

నవతెలంగాణ-లింగంపేట్



మృతిచెందిన ఉదయ్

పాముకాటుతో బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన అడవిలింగాల తండాలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. లింగంపేట్ మండలంలోని భవానిపేట గ్రామపంచాయతీ పరిధిలోని భామనమ్మ తండాకు చెందిన రమేష్ రజిత దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్దకుమారుడు ఉదయ్ (6) భవానిపేట్ పాఠశాలలో చదువుతున్నాడు. వారి అమ్మమ్మ గారి ఊరైన అడవి లింగాలకు శనివారం వెళ్లాడు. రాత్రి అమ్మమ్మతో బెడ్లో పడుకున్నప్పుడు బెడ్‌లో ఉన్న పాము కరవడంతో నురుగులు కక్కుకొని మృతిచెందాడు. పాము కాటు వేసిన విషయం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బాలుడి మృతదేహాన్ని బామ్మనమ్మ తండాకు తీసుకువచ్చారు. అల్లారి ముద్దుగా ఉండే కుమారుడు మృతి చెందడంతో కుటుంబీకులు శోకసంద్రంలో మునిగిపోయారు. దీంతో తండాలో విషాదచాయలు నెలకొన్నాయి.

నవతెలంగాణ

నిజామాబాద్

2

సోమవారం 24 ఏప్రిల్ 2023

పెర్కిట్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ చోరీ



నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ వ్యవసాయ పంట భూముల్లో 25 కేవీ సామర్థ్యం కల ఎస్ఎస్ 146 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్‌ను ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. స్థానిక రైతులు అందించిన సమాచారం మేరకు ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ కాయిల్స్, ఆయిల్‌ను దొంగలు ఎత్తుకెళ్లినట్లు రైతులు వాపోయారు. ట్రాన్స్‌ఫార్మర్ గద్దె నుంచి పడివేసి కాయిల్స్, ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు. స్థానిక విద్యుత్ లైన్‌మెన్ రవి, జూనియర్ లైన్‌మెన్ అరుణ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాగా విద్యుత్ అధికారులు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించారు.

నేడు ప్రజావాణి వాయిదా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్టు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం రాష్ట్ర మహిళా కమిషన్ బృందం జిల్లా పర్యటనకు విచ్చేస్తోందని, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం మీటింగ్ హాల్‌లో అధికారులతో సమీక్ష, సెమినార్ కార్యక్రమాలు నిర్వహిస్తారని అన్నారు. మహిళా కమిషన్ పర్యటన దృష్ట్యా సోమవారం జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

సమస్యలపై సమరానికి సై

- కనీస వేతనం పెంచాలంటున్న వీఓఏలు
- ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ పరిధిలో పనిచేస్తున్న వీవోఏ (గ్రామ సమైక్యల అసిస్టెంట్లు, విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు) తమ శ్రమకు తగిన వేతనం ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఏండ్ల నుంచి తమకు వేతనాలు పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నా.. పట్టించుకున్న దాఖలాలు లేవని చెబుతున్నారు. తప్పని పరిస్థితుల్లో ఈనెల 24 నుంచి తాము సమ్మె చేసేందుకు సిద్ధమవుతున్నామని వారు చెబుతున్నారు.

నవతెలంగాణ-ఆర్మూర్

గత 20 సంవత్సరాల నుంచి..

మహిళ సంఘాలను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు క్షేత్రస్థాయిలో తెలియజేస్తూ చైతన్య పరుస్తున్నారు. గత 20 సంవత్సరాలుగా గొడ్డు చాకిరి చేస్తున్న తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని క్షేత్రస్థాయిలో రోజంతా కష్టపడి పనిచేస్తున్న తమకు రూ.3900 వేతనం ఇవ్వడం దారుణమని మొరపెట్టుకుంటున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ 30శాతం పీఆర్‌సీని కూడా ప్రభుత్వ ఉద్యోగులకు ఇటీవల ప్రకటించినా.. ప్రస్తుతం ఉన్న నిత్యావసర ధరల దృష్ట్యా వేతనాలు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బంగారు తెలంగాణ పునర్నిర్మాణంలో ఉన్నటువంటి ప్రతి ఒక ఉద్యోగి జీవితాల్లో వెలుగులు నింపుతున్న పని చేస్తున్నటువంటి వీఓఏల జీవితాల్లో కూడా వేతనాల పెంపుదల చేసి వెలుగులు నింపాలని కోటి ఆశలతో ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

ప్రభుత్వం దృష్టికి ఎన్నోసార్లు తీసుకువచ్చిన..

ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, 10 లక్షల సాధరణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని సెర్ప్ నుంచి ఐడీ కార్డులు ఇవ్వాలని తదితర సమస్యలను పరిష్కరించాలని అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చినా.. ఎలాంటి స్పందన రాలేదు. దీంతో తప్పని సరి పరిస్థితుల్లో న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మె చేసేందుకు సిద్ధమయ్యారు. ఉమ్మడి జిల్లాలోని కొన్నిచోట్ల ఎంపీడీవో కార్యాలయాల్లో సమ్మె నోటీసులను సైతం అందజేశారు.

ఐకేపీ వీఓఏలు చేస్తున్న పనులు..

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ప్రతి పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రచారం చేయడంలోనూ, గ్రామ సమైక్య సమావేశం ఏర్పాటు చేయడంలోనూ ఆగిపోయిన సంఘాలను గుర్తించి తిరిగి నడిపించుట, రుణాలు ఇప్పించడంలోనూ, ఆసరా పెన్షన్ల పంపిణీలో పాల్గొనడం, రికార్డులు రాయడం, గ్రామాలలో పారిశుధ్యం, మరుగుదొడ్ల స్వచ్ఛ భారత్‌పై అవగాహన కల్పించడంలోనూ, దళిత బస్తీల యందు అర్హత గల సభ్యులను గుర్తించి సంఘాలలో చేర్పించడంలోనూ, నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంలోనూ, సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయడానికి రైతులను ప్రోత్సహించడంలో, పల్లె ప్రగతి పథకంలో విధులు నిర్వహించటం, శ్రీనిధి ద్వారా సభ్యులకు లోన్లు మంజూరు చేయడం, గ్రామాలలో వికలాంగులను గుర్తించి వారిని సదరన్ క్యాంపు గురించి అవగాహన కల్పించడంలోనూ, హరితహారం కార్యక్రమంలో ఇంటింటికి మొక్కలు పంపిణీ చేయడంలోనూ, యువతీ యువకులకు, మహిళలకు ఆరోగ్య పరిరక్షణ సదస్సులు నిర్వహించడంలోనూ అనేక పనుల్లో వీరు ముందుంటున్నారు.



ఈ నెల 17న డీఆర్‌డీఏ పీడీ చందర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీవోఏలు

జిల్లాలో ఇలా..

జిల్లాలో 806 గ్రామ సమైక్యలు ఉన్నవి. కోటగిరి మండలంలో అశోక్ అనే వీవోఏ కరోనా సమయంలో చనిపోయాడు. కేవలం ఆర్మూర్, ఆలూర్ మండలాలలో కలిపి 34 సమైక్యలు ఉన్నవి. వీరికి సెర్ప్ నుంచి నెలకు రూ.3,900, గ్రామ సమైక్య నుంచి రూ.2000 చొప్పున మొత్తం 5900 వేతనం చెల్లిస్తున్నారు. అధికారులు ఆదేశించిన పనుల్లో కూడా తలమునకలై ఉంటున్నారు. గ్రామ సమైక్యలకు మండల సమైక్యలకు సెర్ప్ ఉద్యోగులకు వీవోఏలు వారధిగా వ్యవహరిస్తున్నారు.

శ్రమ దోపిడీకి గురవుతున్నాం



గతంలో కనీస వేతనం రూ.10000 చెల్లించాలని ఉద్యమం నిర్వహించగా ప్రభుత్వం సగం కంటే తక్కువ వేతనంను నిర్ణయించింది. ఉమ్మడి జిల్లాలలోని విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు శ్రమ దోపిడీకి గురవుతున్నారు. పనికి తగిన వేతనం అందడం లేదు. ప్రభుత్వం స్పందించాలి. **– కే పోశెట్టి, వీఓఏల జిల్లా అధ్యక్షులు.**

ఓవర్ హీట్, షాట్ సర్క్యూట్‌తో లారీ దగ్ధం



పూర్తిగా దగ్ధమైన లారీ

నవతెలంగాణ-మెండోరా

మెండోర మండలంలోని పోచంపాడ్ ఎక్స్‌రోడ్డు సమీపంలో శనివారం రాత్రి లారీ దగ్ధం అయినట్లు ఎస్ఐ శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. రాజస్థాన్ రాష్ట్రం, బిల్వాడ జిల్లా, సాక్రియ గ్రామ నివాసి అయిన దీపక్ భైరగి మహారాష్ట్ర నాగ్‌పూర్‌లో లారీలో టాటా స్టీల్(ఐరన్) లోడ్ చేసుకుని మహారాష్ట్ర నుంచి ఈ నెల 22న శనివారం రోజున ఉదయం 7 గంటలకు బయలు దేరగా ఆదేరోజు సాయంత్రం 7:15 నిమిషాల ప్రాంతంలో నిజామాబాద్ జిల్లా మెండోర మండల పరిధిలోని పోచంపాడ్ ఎన్‌హెచ్ 44 ఎక్స్ రోడ్డు సమీపంలోని ఆర్‌పీ ఫంక్షన్ హాల్ వద్ద ఇంజన్ ఓవర్ హీట్ అవ్వడంతో వైరింగ్ షార్ట్ సర్క్యూట్ అయ్యి ప్రమాదవశాత్తు లారీలో మంటలు చెలరేగాయి. ఇది గమనించిన లారీ డ్రైవర్ దీపక్ భైరగి లారీలో నుంచి బయటికి దూకి స్థానికుల సహాయంతో పోలీసులకు సమాచారం అందించగా ఫైరింజన్ సహాయంతో మంటలు ఆర్పడానికి ప్రయత్నించారు. అయినా ఫలితం లేకపోయింది. మంటలు చెలరేగి లారీ పూర్తిగా కాలిపోయింది. లారీ డ్రైవర్ మెండోర పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఇంజన్ ఓవర్ హీట్ వలన వైరింగ్ షార్ట్ సర్క్యూట్ అయ్యి లారీ దగ్ధం అయ్యినట్టు తెలిపారు. ప్రమాదాన్ని డ్రైవర్ గమనించడంతో ఎవరికి గాయాలు కాకుండా పెను ప్రమాదం తప్పింది.

బషీరాబాద్‌లో సామాజిక తనిఖీ గ్రామసభ



సభలో పాల్గొన్న గ్రామస్తులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సక్కరం అశోక్ అధ్యక్షతన ఆదివారం గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో సామాజిక తనిఖీ బృందం సభ్యులు జాతీయ గ్రామీణ ఉపాధి హామీపై 14వ విడత సామాజిక తనిఖీ నిర్వహించిన నేపథ్యంలో గ్రామ సభ జరిగింది. గ్రామగ్రామంలో ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ చేసి, గ్రామంలో ఉన్న పరిస్థితిని సభలో చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కస్తూరి విక్రమ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వార్డు సభ్యులు పోషన్న, శ్యామ్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బైకాని మహేష్, సక్కారం నారాయణ, నెల్ల రమేష్, బిన్.మోహన్, తనిఖీ అధికారి పవన్ సాయి, సీనియర్ మేట్ ఆర్.పి రాజు, ఉపాధి హామీ మెట్లు, కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి ప్యాకెట్లు విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

- మరో ఇద్దరు పరారీ
- వివరాలు వెల్లడించిన నిజామాబాద్ ఏసీపీ కిరణ్ కుమార్
- నవతెలంగాణ కథనంతో పోలీసుల్లో కదలిక

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాలో ఆగని గంజాయి దందాపై 'గల్లిగల్లికీ అడ్డాలు' అనే శీర్షికన నవతెలంగాణ దినపత్రికలో ఈ నెల 22న కథనం ప్రచురితమైంది. కథనానికి స్పందించిన పోలీసులు అందులో భాగంగా గంజాయి ప్యాకెట్లు విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. నవ తెలంగాణ దినపత్రిక రాసిన కథనంతో 24 గంటల్లోనే పోలీసుల్లో కదలిక వచ్చింది.


నవతెలంగాణ

గల్లిగల్లికి అడ్డాలు..!

నవతెలంగాణతో ప్రచురితమైన కథనం

నిజామాబాద్ నగరంలోని వినాయక్‌నగర్‌లో అమ్మ వెంచర్‌లో గంజాయి ప్యాకెట్లు విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్టు, మరో ఇద్దరు పరారీ అయ్యారని నిజామాబాద్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కిరణ్ కుమార్ తెలిపారు. ఆదివారం ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. అసాంఘిక కార్యక్రమాలకు అడ్డా అయిన అమ్మ వెంచర్‌లో శనివారం సాయంత్రం విశ్వసనీయ సమాచారం మేరకు నిజామాబాద్ నగర సీఐ వెంకటనారాయణ, 4వ టౌన్ ఎస్ఐ సందీప్ ఆధ్వర్యంలో ఐదుగురుని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా ముగ్గురు పట్టుబడ్డారు. ఇద్దరు పరారీ అయ్యారు. వారి వద్ద నుంచి 11 గంజాయి ప్యాకెట్లు, 2 సెల్ ఫోన్లు, రెండు బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఈజీగా డబ్బులు సంపాదించాలన్న లక్ష్యంతో నాందేడ్ నుంచి గంజాయి కొనుగోలు చేసి నిజామాబాద్‌లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. పట్టుబడిన వారిలో సుభాష్‌నగర్ రైతు బజార్‌కు చెందిన డిగ్రీ విద్యార్థి గుగురు ఈశ్వర్, ఎల్లమ్మ గుట్టకు చెందిన ప్రైవేటు ఉద్యోగి లక్క శశాంక్ ఆలియాస్ సోను, ఆర్యనగర్‌కు చెందిన డిగ్రీ సెకండ్ ఇయర్ విద్యార్థి బాదావత్ ప్రమోద్ ఉన్నారు. పరారీలో ఉన్నవారు బాలు, తరుణ్‌గా గుర్తించారు. పరారీలో ఉన్న వారిని త్వరలో పట్టుకుంటామని పేర్కొన్నారు. గంజాయి విక్రయాల కేసును ఛేదించిన నగర సీఐ వెంకటనారాయణ, 4వ టౌన్ ఎస్ఐ సందీప్‌ను ఏసీపీ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ

లారీ ఢీకొని వ్యక్తి మృతి

- కుటుంబీకుల, స్థానికుల రాస్తారోకో
- ఘటనా స్థలంలో పోలీసుల బందోబస్తు

నవతెలంగాణ-వర్ని

మండలంలోని ఆదివారం బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని పక్కనుంచి వచ్చిన లారీ ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన వర్ని మండల కేంద్రంలో చోటుచేసుకుంది. లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ఈ ఘటన జరిగినట్టు ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. పాత వర్ని గ్రామానికి చెందిన లోకుల రమేష్ (35) గ్రోమోర్ ప్రైవేట్ పార్టీ లేజర్‌లో సెల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. మధ్యాహ్నం ఇంటికి వెళుతుండగా నిజామాబాద్ వైపు వెళ్లే రహదారిపై వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో రమేష్ కిందపడిపోయాడు. లారీ టైర్లు తల భాగంపై వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, కొడుకు, కూతురు ఉన్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు భారీ ఎత్తున ఘటనా స్థలానికి చేరుకొని రోడ్డుపైన రాస్తారోకో చేశారు. మృతుని కుటుంబానికి లారీ యజమాని న్యాయం చేయాలంటూ రాస్తారోకో చేపట్టారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

లారీ డ్రైవర్ మద్యం సేవించి నడపడంతో ఈ ఘటన జరిగిందని లారీకి సంబ ంధించిన డాక్యుమెంట్లు, డ్రైవర్ లైసెన్స్ లేకపోవడంతో గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మృతుని కుటుంబానికి న్యాయం చేయాలంటూ రాస్తారోకో చేపట్టారు. దీంతో లారీ యజమాని బాధిత కుటుంబానికి రూ.9లక్షలు ఇచ్చేందుకు అంగీకరించడంతో మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు శాంతించి రస్తారోకోను విరమించారు.

నాణ్యతతో పనులు చేయాలి

- డీఆర్‌డీఏ పీడీ చందర్ నాయక్
- ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో చేపట్టే పనులను నాణ్యతతో చేయాలని డీఆర్‌డీఏ పీడీ చందర్ నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో మండలంలోని ఆయా గ్రామాల్లో జరిగిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సామాజిక తనిఖీ ప్రజా వేదికకు చందర్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉపాధి హామీ పనుల్లో ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా పనులు చేయాలన్నారు. కొలతల్లో, కూలీలకు చెల్లింపుల్లో ఉపాధి సిబ్బంది నిర్లక్ష్యం చూపద్దన్నారు. అనంతరం ప్రజావేదికలో 2022 జనవరి 1వ తేదీ నుంచి 31 మార్చి 2023 వరకు మండలంలో రూ.14 కోట్ల 45 లక్షల 64వేల 790 రూపాయలతో ఆయా గ్రామాల్లో జరిగిన 1261 పనులపై చర్చించారు. ఆయా గ్రామాల్లో ఎస్ఆర్‌పీ మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సామాజిక తనిఖీ నివేదికలను ప్రజావేదికలో చదివి వినిపించారు. గ్రామాల్లో సామాజిక తనిఖీల సందర్భంగా జాబ్ కార్డు లేని సమస్య, కూలీలకు ఆలస్యంగా చెల్లింపులు, ప్లాట్‌ఫామ్‌ల నిర్మాణాల్లో అధిక చెల్లింపులు, కందకాలలో కొలతల తేడాలు చోటు చేసుకున్నట్లు సామాజిక బృందం సభ్యులు గుర్తించారు. బృందం సభ్యులు గుర్తించిన అంశాలపై పూర్తి వివరాలను సమర్పించాలని ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లను పీడీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి నారాయణ, అంబుడ్స్‌మెన్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సంతోష్ రెడ్డి, ఈజీఎస్ ఏపీవో విద్యానంద్, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ చందర్‌నాయక్

అర్ధరాత్రి రోడ్డుకు అడ్డంగా పడ్డ జువ్వి చెట్టు

- నిప్పు పెట్టడంతో కాలిపోయి రోడ్డుపై పడ్డ చెట్టు



రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హాసకొత్తూర్ ఇందిరమ్మ కాలనీ సమీపంలో బీటీ రోడ్డుకు అడ్డంగా శనివారం అర్ధరాత్రి జువ్విచెట్టు విరిగిపడింది. గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి పూట చెట్టు మొదలుకు నిప్పు పెట్టడంతో చెట్టు పూర్తిగా కాలిపోయి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. సుమారు అర్ధరాత్రి రెండు గంటల సమయంలో కమ్మర్‌పల్లి నుంచి హాసకొత్తూర్ వెళ్తున్న పెట్రోలింగ్ పోలీస్ అధికారులు కానిస్టేబుల్ ప్రసాద్, సంతోష్ నాయక్ చెట్టు రోడ్డుకు అడ్డంగా పడి ఉండడాన్ని గమనించారు. వెంటనే హాసకొత్తూర్ గ్రామ ఉపసర్పంచ్ ఏనుగు రాజేశ్వర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే స్పందించిన ఉప సర్పంచ్ రాజేశ్వర్ జువ్వి చెట్టు విరిగిపడ్డ ప్రదేశానికి వచ్చి పరిశీలించారు. బ్లేడు ట్రాక్టర్‌ను పిలిపించి తెల్లవారుజామున ఉదయం 3 గంటలకు రోడ్డుకు అడ్డంగా ఉన్న జువ్వి చెట్టును పక్కకు తోయించి, ఈ బీటీ రోడ్డు గుండా రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా చేశారు. రాత్రి ఒక ఫోన్ కాల్ చేసి సమాచారం ఇవ్వగానే స్పందించి వెంటనే వచ్చి సమస్యకు పరిష్కారం చేసినందుకు పోలీస్ కానిస్టేబుల్ లు ప్రసాద్, సంతోష్ నాయక్ ఉప సర్పంచ్ రాజేశ్వర్‌కు అభినందనలు తెలిపారు. అయితే రాత్రిపూట చెట్లను కాల్చే వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు ఇటువంటివి పునరావృతం కాకుండా అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పంట నష్టపోయిన రైతాంగాన్ని వెంటనే ఆదుకోవాలి

నవతెలంగాణ-సిరికొండ

అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు తాహెర్‌బిన్ హందాన్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రైతుల పక్షపాతి అని ప్రగల్భాలు పలుకుతున్నాడు తప్ప, రైతాంగానికి చేసిన మేలు ఏమీ లేదని అన్నారు. పంట నష్టం 2 లక్షల 28 వేల ఎకరాలల్లో జరిగితే, కేవలం 151వేల ఎకరాలలో పంట నష్టం జరిగిందని తప్పుడు లెక్కలు సృష్టించి, రైతులను మోసం చేస్తున్నారని, జిల్లావ్యాప్తంగా కొన్ని ప్రాంతాలలో వరి పంట ముందుగా వేయడంతో అక్కడ ఎలాంటి నష్టం జరగలేదని, వెనుకబడిన రైతుల పంట పూర్తిగా నష్టం జరిగిందని అన్నారు. నష్టపోయిన వరి, మొక్కజొన్న, మామిడి పంటలకు సరియైన నివేదికను రూపొందించి, రైతులకు నష్టపరిహారం అందజేయాలని, రైతులను మోసం చేసిన ప్రభుత్వం ఎక్కువ కాలం నిలదొక్కుకోలేదని, రానున్న ఎన్నికలలో ప్రజలు, రైతులు గట్టిగా బుద్ధి చెప్తారని అన్నారు. తక్షణమే సరియైన నివేదికలతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

మహనీయుల జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి

- ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ కమిటీ గౌరవ అధ్యక్షులు పరిమి కోటేశ్వరరావు

నవతెలంగాణ-బోధన్

ఏప్రిల్ 30వ తేదీన బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే మహనీయుల జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ కమిటీ గౌరవ అధ్యక్షులు పరిమి కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మహనీయుల జయంతి ఉత్సవాలకు జిల్లా నుంచి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో భాగంగా అచన్‌పల్లి బైపాస్ నుంచి అంబేద్కర్ చౌరస్తాలోని సభ ప్రాంగణం వరకు మహా ర్యాలీ ఉంటుందన్నారు. అలాగే మహారాష్ట్ర కళాకారులచే "అమ్నా సామ్న" కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ ముఖ్య సలహాదారు కొండ్రా వెంకటి, కమిటీ కన్వీనర్ నీరడి ఈశ్వర్, ఉపాధ్యక్షులు సింగడే పాండు, నీరడి రవి, కమిటీ సభ్యులు సుభాష్, దేవేందర్, రాహుల్, విఠల్, భీమ్‌రావు, సురేందర్, యాదగిరి తదితరులు ఉన్నారు.



బోధన్ : మాట్లాడుతున్న నాయకులు

మహనీయుల సభను జయప్రదం చేయాలి..

ఎడపల్లి : ఈ నెల 28న ఎంయస్పీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహనీయుల జయంతి ఉత్సవ సభను విజయవంతం చేయాలని ఎడపల్లి మండల కేంద్రంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంయస్పీ జిల్లా కోఆర్డినేటర్ దల్లా సురేష్ మాట్లాడుతూ.. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కుల పెద్దలు కర్రోల్ల గంగాధర్, మేతరి పోచయ్య, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

కామారెడ్డి

3

సోమవారం 24 ఏప్రిల్ 2023

సీఎంను కలిసిన ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

నవతెలంగాణ-కామారెడ్డి

సీఎం కేసీఆర్‌ను ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలివారు. కామారెడ్డి జిల్లాలోని మాచారెడ్డి మండలంలో ఉన్న పాల్వంచ గ్రామాన్ని కొత్త మండలంగా ప్రకటించినందుకు పూలబొకేను అందజేసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విప్

నేడు విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం

నవతెలంగాణ-తాడ్వాయి

కృష్ణాజివాడి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న కృషజీవాడి, బ్రహ్మజివాడి గ్రామాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులకు నేడు(సోమవారం) ఉదయ 9.30 గంటలకు పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అందరూ సకాలంలో తప్పకుండా హాజరై మీ పిల్లల ఈ సంవత్సరం సాధించిన విద్యా అభివృద్ధి, హాజరు తీరు, వార్షిక పరీక్షల ఫలితాలు తదితర వాటిపై సమావేశంలో చర్చించనున్నట్టు తెలిపారు. సమావేశానికి గ్రామ సర్పంచ్,పాఠశాల చైర్మన్, కమిటీ సభ్యులు,విద్యార్థుల తల్లిదండ్రులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా బసవేశ్వర జయంతి వేడుకలు



బసవేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న పలువురు

నవతెలంగాణ-పిట్లం

మండల తహసీల్దార్ కార్యాలయంతో పాటు చిన్న కొడప్‌గల్ గ్రామ బసవేశ్వర ఆలయంలో మహాత్మా బసవేశ్వర విగ్రహానికి పూలమాల వేసి జయంతి వేడుకలను భజన మండలి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కుల రహిత సమాజ స్థాపనకు కృషిచేసిన అభ్యుదయ వాది బసవేశ్వరుడని కొనియాడారు. లింగ వివక్షను సమూలంగా వ్యతిరేకించారని అన్నారు. ఆయన చూపిన మార్గములో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. అనంతరం చిన్న కొడప్ గల్ భజన మండలి భక్తాదులకు అల్పాహారం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు వాసవి రమేష్ , విజయ్, లచ్చిరెడ్డి , నర్సా గౌడ్ , శ్రీనివాస్ రెడ్డి , సాయి రెడ్డి , శపథం రెడ్డి , కాంగ్రెస్ పార్టీ నాయకులు జంబిగే హన్మాండ్లు , రవీందర్ నాయక్ , చిన్న కొడప్గల్ సింగిల్ విండో చైర్మన్ నారాయణరెడ్డి , మాజీ డిసిసిబి డైరెక్టర్ సాయి రెడ్డి , డైరెక్టర్ నాగిరెడ్డి , భజన మండలి భక్తాదులు , గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కోఆప్షన్ మెంబర్ ఇంటికెళ్లిన స్పీకర్



స్పీకర్‌ను సన్మానించిన కో ఆప్షన్ మెంబర్ మజీద్ కుటుంబీకులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

బాన్సువాడ డివిజన్ పరిధిలోని నసురుల్లాబాద్ మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వచ్చిన రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి జిల్లా కోఆప్షన్ మెంబర్ మజీద్ ఇంటికి వెళ్లారు. స్పీకర్ రాక సందర్భంగా కుటుంబ సభ్యులు వారిని తన ఇంట్లోకి సాదరంగా ఆహ్వానించారు. మజీద్‌కు స్పీకర్ ఈద్ ముబారక్ తెలిపారు. మజీద్ అందించిన రంజాన్ స్పెషల్ సేమియాను సేవించారు. మజీద్ బాగోగులు అడిగి తెలుసుకున్నారు. మజీద్ ఇంటికి స్పీకర్ చేరుకోగానే స్థానిక బిఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ఆయనను కలిసేందుకు తరలివచ్చారు. మాజిద్ కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. వచ్చిన కార్యకర్తలతో పోచారం మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త పార్టీ గెలుపు కోసం బలంగా పోరాడాలని సూచించారు. పార్టీ ప్రతీ ఒక్కరికీ గౌరవం దక్కుతుందని స్పీకర్ హామీ ఇచ్చారు. నిత్యం బిజీగా ఉండే స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి తమ ఇంటికి రావడం ఎంతో సంతోషంగా ఉందని, తాము దీన్ని జీవితాంతం మర్చిపోలేమని కో ఆప్షన్ నెంబర్ మజీద్ వారి కుటుంబ సభ్యులు తెలిపారు. వీరి వెంట పార్టీ మండల అధ్యక్షుడు పెరిక శ్రీనివాస్, ఎంపీపీ, పి, విఠల్ వివిధ గ్రామాల సొసైటీ అధ్యక్షులు గ్రామ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి పలువురి విరాళం



విరాళాలు అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని పోతిరెడ్డిపల్లి వీరాంజనేయ స్వామి దేవాలయ భూదానం కోసం పలువురు దాతలు విరాళాలు అందజేశారని ఆలయ నిర్వాహకులు తేజ స్వామి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రానికి చెందిన బొడ్ల శివకుమార్ 5 వేల రూపాయలు విరాళముగా అందజేయగా, హౌసుల శ్రీకాంత్ స్రవంతి 10 వేల 500 రూపాయలను అందించారన్నారు. బాన్సువాడ డివిజన్ కేంద్రానికి చెందిన నరసింహ చారి 2వేల ఒక వంద రూపాయలను విరాళంగా అందజేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల భక్తాదులు పాల్గొన్నారు.

స్తూపం నిర్మాణం కోసం ఇరు వర్గాల మధ్య ఘర్షణ

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలో ఆదివారం కామ్రేడ్ ములుగు రాజేందర్ స్మారకార్థం నిర్మించనున్న స్తూపం విషయంలో సిపిఐ ఎంఎల్ ప్రజా పంథ నాయకులకు, స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ మధ్య ఘర్షణ నెలకొంది. కామ్రేడ్ రాజేందర్ 2021 మేలో మృతి చెందాడు. ఆయన కార్మిక, కర్షక రైతాంగ పోరాటంలో చురుగ్గా పాల్గొన్న నాయకుడని ఆయన స్మారకార్థం స్తూపం గ్రామంలో నిర్మించడానికి గతంలో పలుమార్లు గ్రామ అభివృద్ధిని కమిటీని సంప్రదించినట్లు తెలిపారు.అనేక ప్రదేశాలలో నిర్మించుకోవాలని చూయించారని చివరకు ఆదివారం రోజు స్థూపం నిర్మాణం కోసం స్థానిక ఎల్లం చెరువు కట్ట కింది భాగంలో తవ్వకం ప్రారంభించగానే గ్రామస్తులు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు వచ్చి నిర్మాణం ఆపివేయాలని చెప్పడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ నెలకొన్నట్టు సీఐ సైదా తెలిపారు. ఇరు వర్గాల శాంతి నెలకొల్పాలని ఉద్దేశంతో ఇరు వర్గాలను పిలిపించి చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. గ్రామస్తులు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు సమస్యను శాంతంగా పరిష్కరించుకోవాలని సిఐ తెలిపారు.



ఘర్షణలో ఓ వ్యక్తికి గాయాలు

ఖాజీల రెన్యువల్‌కు పోటీ

- వారసత్వం ముసుగులో ఖాజీలా పదవి

నవతెలంగాణ-నసురుల్లాబాద్

ముస్లిం పెళ్లిలను జరిపించే ఖాజీలు తమ వంశస్తులకే ఖాజీల పదవికి అవకాశం ఇవ్వాలని తీవ్ర పోటీ పడుతున్నారు. 1957లో ప్రభుత్వ రంగ సంస్థల్లో వారసత్వం పనికి రాదని, అర్హులైన వారు ఆ పదవులు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ నేటికీ వారసత్వ పదులు కావాలంటూ పోటీ పడుతున్నారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ డివిజనల్ పరిధిలోని నసుల్లాబాద్ మండలం దుర్కి గ్రామంలో వారసత్వ కాజీలు ఉన్నారు. దుర్కి ఖాజీ పదవికి మూడు నియోజకవర్గాల గ్రామాలు ఉన్నాయి. ఒకే కుటుంబ సభ్యుల వారు గత కొన్ని ఏండ్లుగా ఖాజీ పని చేస్తున్నారు. ఈ సంవత్సరం ఖాజీల పదవి నాకు కావాలంటే నాకు కావాలని కుటుంబ సభ్యులు పోటీ పడుతున్నారు. ఖాజీల రెన్యూవల్ కాలం మూడు సంవత్సరాలు ఉండగా ఈ ఏడాదికి పదవి కాలం పూర్తి కావడంతో రాష్ట్ర మైనార్టీ ముఖ్య కార్యదర్శి కార్యాలయంలో కొందరు దరఖాస్తులు చేసినట్లుగా తెలిసింది. మాకు అంటే మాకు కావాలని పైరవీలు చేస్తున్నట్లు తెలిసింది. గతంలో సయ్యద్ బద్రుద్దీన్‌కు ఆనాటి అధికారులు ఖాజీ పదవిని అప్పగించారు. బద్రుద్దీన్ వారి వారసత్వంలో ముజుబుద్దీన్ కొన్ని సంవత్సరాలు నాయబ్ ఖాజీల ద్వారా పెళ్లిళ్లు చేస్తూ వచ్చారు. తరువాత వీరి గుమస్తా సయ్యద్ శాహెబజ్ హుసేనికి నాయబ్ హాజీగా బాధ్యతలు అప్పగించారు. గుమస్తా శాహెబాజ్ ఉషేని కొడుకు సయ్యద్ మగ్దుమ్ హుసేనికి నాయబ్ ఖాజీగా నియమిస్తూ, వీరి పదవి 2019న ముగియడంతో పాత వంశస్తులకు చెందిన సయ్యద్ మోసిన్‌కు అధికారులు సదరు ఖాజీగా బాధ్యతలు ఇచ్చారు. ఈ సంవత్సరం నాటికి వారి ప ద వీ కా ల ం ముగియడంతో సదర్ కాజీల వారసత్వ కుటుంబ సభ్యులు ఖాజీ పదవి కోసం పోటీ పడుతున్నారు. వారసత్వ పదవులు ఉండరాదని, గతంలో రెండు, మూడు మండలాలకు ఒక ఖాజీ లను ఏర్పాటు చేసి, ముస్లింల పెండ్లిలతో పాటు విద్య, సామాజిక అవగాహన కల్పించేందుకు ఖాజీలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ముస్లిం పెద్దలు విన్నవించారు. ఉమ్మడి జిల్లాలో ఈ ఖాజీల బెడద ఎక్కువ అవుతుంది. కొందరు నిజాయితీగా విధులు నిర్వహిస్తుండగా మరి కొందరు ఇష్టారాజ్యంగా వ్యవరిస్తున్నారు. ఒక పెళ్లికి ఓ ఖాజీ న్యాయ బద్ధంగా తీసుకుంటే మరో ఖాజీ పెళ్లి ఫీజు అధికంగా వసూల్ చేస్తున్నారు. ఏమిటి అని ప్రశ్నిస్తే నీకు ఏమీ తెలుసు అని ఎదురు ప్రశ్నిస్తారు. స్థానికులై ఉండి చదువుకొని ఉన్న వారికి ఇలాంటి పదవి ఇస్తే ప్రజలకు న్యాయం జరుగుతుందని బాన్సువాడ నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.



సమాజ స్థాపనకు కృషిచేసిన
మానవతమూర్తి బసవేశ్వరుడు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

సమాజ స్థాపన కోసం బసవేశ్వరుడు చేసిన కృషి మరువలేనిదని కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే సౌదగర్ గంగారం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బసవేశ్వర జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బసవేశ్వరుని విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం లింగాయత్ సమాజ్ పెద్ద కొడపగల్ అధ్యక్షులు సంతోష్ దేశాయ్ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల వర్ణ లింగ వివక్షలు లేని సమాజ స్థాపనకు కృషిచేసిన మానవతమూర్తిగా అభివర్ణించారు. భారతీయ ఆత్మీయత ప్రపంచంలో వీరశైవం స్థాపించి మతాన్ని విప్లవికరించారని అన్నారు. దేవాలయాలకు దళితుల ప్రవేశం దారి చూపారని జ్ఞానం అనే గురువు ఆచారమే లింగం అనుభవమే జంగమం అని విపలీకరించారని పరమశివుని ప్రతి రూపమైన ఇష్ట లింగాన్ని చేతికిచ్చి గుడి సంస్కృతి కుల వ్యవస్థకు ప్రత్యామ్నాయం ప్రతిపదించారని అన్నారు. బ్రాహ్మణ కన్నెకు దళిత యువకుడికి వివాహాన్ని తలపెట్టడం ద్వారా కుల వ్యవస్థ రూపుమాపడానికి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో లింగాయత్ సమాజ్ మండల అధ్యక్షుడు మాధవరావు, గ్రామ అధ్యక్షుడు సంతోష్ దేశాయ్, వెంకటేష్ పటేల్, బసవరాజ్, సూర్యకాంత దేశాయ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్ దేశాయ్, సొసైటీ చైర్మన్ హనుమంత్ రెడ్డి, ఉపసర్పంచ్ విట్టల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, లింగాయత్ యూత్ సభ్యులు, యువకులు,గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న నాయకులు

ఇద్దరు పిల్లలతో వివాహిత అదృశ్యం

నవతెలంగాణ-లింగంపేట్

ఇద్దరు పిల్లలతో సహా వివాహిత అదృశ్యమైన ఘటన లింగంపేట్ మండలంలోని బాణాపూర్ గ్రామంలో ఆలస్యంగా ఆదివారం వెలుగుజూసింది. ఎస్ఐ శంకర్ వివరాల ప్రకారం.. మండలంలోని బాణాపూర్ గ్రామానికి చెందిన డప్పు సాయిలుకు భిక్కనూర్ మండలం జంగంపల్లి గ్రామానికి చెందిన నవనీతతో 2014లో సంవత్సరములు వివాహం చేశారు. ఇద్దరూ బతుకుదెరువు కోసం హైదరాబాదులో స్థిరపడ్డారు పనులు చేసుకుంటూ జీవనం కొనసాగి స్తున్నారు. వీరికి ఇద్దరు సంతానం. కాగా భార్యాభర్తల మధ్య కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో భర్తకు చెప్పకుండా నెల రోజుల క్రితం పుట్టింటికి వచ్చింది. అయితే అక్కడి నుంచి 14వ తేదీనా ఎవరికి చెప్పకుండా ఇద్దరు పిల్లలను తీసుకొని వెళ్లిపోయింది. చుట్టుపక్కల వెతికినా, బంధువుల ఇండ్లల్లో ఆరా తీసిన ఆచూకీ లభించలేదు. కూతురు కనిపించకపోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.



ఇద్దరు పిల్లలతో అదృశ్యమైన నవనీత

వ్యక్తి దారుణ హత్య

- భార్యే హత్యచేయించినట్టు అనుమానాలు

నవతెలంగాణ-రాజంపేట్

అదృశ్యమైన వ్యక్తి దారుణహత్యకు గురైన ఘటన రాజంపేట్ మండల కేంద్రంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. కాగా భార్యే.. భర్తను హత్యచేసినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన రంగు లింగం (50) శుక్రవారం రోజు ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదు. అతని భార్య లావణ్య పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేసింది. కాగా ఆదివారం సిద్దులగుట్ట ప్రాంతంలో వ్యక్తి గొంతు కోసి హత్య చేసినట్టు పోలీసులు గుర్తించారు. భార్య లావణ్య కొంతమందితో కలిసి తన భర్తను హత్య చేసి ఆ ప్రాంతంలో పడవేసినట్టు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు. అన్ని కోణాల్లో విచారణ చేపట్టి త్వరలో వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.



లింగం(ఫైల్)

ఈటల వాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

రేవంత్ రెడ్డిపై ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డికి క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆదివారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈటల రాజేందర్ దిష్టిబొమ్మ దహనం చేశారు.ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి 25 కోట్లు బీఆర్ఎస్ నుంచి తీసుకున్నాడని అనుచిత, ఆరోపణలు చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే ఈటల రాజేందర్ రేవంత్ రెడ్డికి తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఈటెల రాజేందర్‌కు దమ్ముంటే నిన్న ఎందుకు భాగ్యలక్ష్మి అమ్మవారి టెంపుల్ కి వెళ్ళలేదని ప్రశ్నించారు. ఆధారాలు ఉంటే దమ్ముంటే మీడియా సమావేశం పెట్టి వెల్లడించాలని అంతేగాని లేనిపోని ఆరోపణలు చేసి రేవంత్ రెడ్డికి రాష్ట్రంలో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక అనుచిత ఆరోపణలు చేస్తే మాత్రం సహించేది లేదని అన్నారు. వెంటనే క్షమాపణలు చెప్పకపోతే రాష్ట్రంలో ఎక్కడా కూడా తిరగకుండా అడుగడుగున అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

భార్యపై హత్యాయత్నం కేసులో భర్త రిమాండ్

నవతెలంగాణ-గాంధారి

భార్యను హత్యాయత్నం చేసిన భర్తను రిమాండ్‌కు తరలించినట్టు సీఐ రామన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గాంధారి మండలం నేరల్ తండాకు చెందిన ధరావత్ రామ్ సింగ్‌కు పిస్కులగుట్టకు చెందిన మమతతో 2 సంవత్సరాల క్రితం వివాహమైంది. కాగా తన భర్త ప్రతిరోజూ మద్యం తాగి కొట్టేవాడని, అనుమానంతో భార్యను హత్య చేయడం కోసం ఇంట్లో ఉన్న మటన్ కొట్టే కత్తి తీసుకొని వెంటబడగా గ్రామస్తులు అడ్డుకోవడంతో అడ్డుకున్న గ్రామానికి చెందిన రవీందర్ అనే వ్యక్తికి గాయం అయింది. కాగా తనను చంపడానికి యత్నించిన భార్తపై ఆమె ఫిర్యాదు చేయడంతో గాంధారి ఎస్సై డి.సుధాకర్ కేసు నమోదు చేయగా, దర్యాప్తు చేస్తున్న సదాశివ నగర్ సీఐ రామన్ పూర్తి వివరాలు సేకరించి దరావత్ రాంసింగ్‌ను అరెస్ట్ చేశాడు. చంపేందుకు యత్నించిన కత్తిని స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.



నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

దళారులకు అమ్మి మోసపోవద్దు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి/లింగంపేట్

ఎల్లారెడ్డి మండలంలోని వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సొసైటీ చైర్మన్ ఎగుల నర్సింహులు వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఎల్లారెడ్డి మండలంలోని గండిమాసానిపేట్ లింగారెడ్డిపేట్ లక్ష్మాపూర్ అడివి లింగాల్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని అన్నారు. వరి ధాన్యాన్ని కల్లాల దగ్గర అరబెట్టుకుని కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన వరి ధాన్యాన్ని తీసుకుని రావాలని సూచించారు. వాతావరణ దృష్ట్యా కుప్పలను తడవకుండా కప్పుకోవాలని రైతులకు సూచనలు ఇచ్చారు కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మత్తమాల ప్రశాంత్ గౌడ్, సొసైటీ డైరెక్టర్ సూర్య ప్రకాష్, బాలరాజు, పొలయ్య నరసింహులు, మాజీ ఉపాధ్యక్షులు సాయ గౌడ్, శ్రావణ్ కుమార్, ఆయా గ్రామాల సర్పంచులు ప్రతాప్‌రెడ్డి రవీందర్ ఆయా గ్రామాల ఎంపీటీసీలు, జడ్పీటీసీలు అగ్రికల్చర్ ఏఈఓ సతీష్ కుమార్, సొసైటీ సిఈఓ విశ్వనాథం సత్యనారాయణ, మల్లయ్య ప్రభుదాస్ ఇంచార్జులు సందీప్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డి మండలంలో..

వారంలో ఖాతాల్లోకి ధాన్యం డబ్బులు

లింగంపేట్: యాసంగిలో రైతుల వద్ద నుండి కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన డబ్బులు వారం రోజుల్లో రైతుల ఖాతాలో జమ చేస్తామని లింగంపేట్ సింగిల్ విండో చైర్మన్ కుచనపల్లి దేవేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం లింగంపేట్ సర్పంచ్ బొల్లులావణ్య, ఒంటరి పల్లి గ్రామంలో లతా రాందాస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ యాసంగిలో రైతులు ఇబ్బంది పడకుండా దళారుల బారిన పడకుండా నేరుగా రైతులకు అందుబాటులో ఉండేవిధంగా గ్రామ గ్రామాన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. ఏ గ్రేడ్ 2060, బి గ్రేడ్ 2040 రూపాయలు క్వింటాల్‌కు చెల్లిస్తున్నట్టు తెలిపారు. తూకం వేసిన వారం రోజుల్లోనే రైతుల ఖాతాలో డబ్బులు జమ చేస్తున్నామన్నారు. ప్రభుత్వం రైతులకు మద్దతు ధర ఇస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బంది కలగకుండా రాత్రి వేళలో విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నామని, ఎండలు తీవ్రం కావడంతో తాగునీటి సౌకర్యం కల్పించా మన్నారు. రైతులకు ఇబ్బందులు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. తేమ శాతాన్ని పరిశీలించి వెంటనే తూకం వేయాలని తూకంలో నిర్లక్ష్యం చేయవద్దని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొల్లు లావణ్య ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఒంటరి సిద్ధారెడ్డి, ఒంటరి పల్లి తండా సర్పంచ్ లతా రాందాస్, ఉప సర్పంచ్ రవి సాయిరాం, కార్యదర్శి సందీప్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



లింగంపేట్ : కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్, సర్పంచ్

మహిళలు లేకుండానే బీఆర్ఎస్ మీటింగ్

నవతెలంగాణ-సదాశివనగర్



సమావేశంలో కానరాని మహిళలు

మండలంలోని పద్మాజివాడి రైతు వేదికలో ఆదివారం ఎమ్మెల్యే జాజాల సురేందర్ అధ్యక్షతన బిఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కాగా ఈ సమావేశానికి మహిళలు అవసరం లేదా స్థానిక మహిళలు ప్రశ్నిస్తున్నారు. ప్రజాప్రతినిధుల్లో సగం మంది మహిళలేనని, ఆఖరికి ఎంపీపీ సైతం మహిళా సభ్యురాలేనని, కానీ మీటింగ్‌లో మాత్రం మహిళలు లేరని స్థానికులు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.

25న ప్రజాప్రతినిధుల సమావేశం

ఎల్లారెడ్డి నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న ప్రజాప్రతినిధుల సమావేశం ఈ నెల 25వ తేదీనా నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే జాజాల సురేందర్ తెలిపారు.ప్రజాపతినిధుల సభను విజయవంతం చేయాలని సూచించారు.

రక్తహీనతతో బాధపడుతున్న మహిళకు రక్తదానం

నవతెలంగాణ-తాడ్వాయి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో లక్ష్మీ (28) గర్భిణీ అనీమియాతో బాధపడుతుండటంతో వారికి కావాల్సిన ఓ పాజిటివ్ రక్తం కుటుంబ సభ్యులలో ఎవరికి లేకపోవడంతో వారు ఐవిఎఫ్ సేవాదళ్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు ను సంప్రదించారు. ఆయన దోమకొండ మండల కేంద్రానికి చెందిన వ్యాపారి మందుల సంతోష్‌ను కోరగా.. సకాలంలో చేరుకొని రక్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మందుల సంతోష్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి రక్తం దానం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు.



రక్తదానం చేసిన సంతోష్

ప్రతిరోజు అంబేద్కర్ విగ్రహాన్ని కడిగి పూలమాలలు వేసి ఉంచాలి



నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రతిరోజు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని కడిగి పూలమాలలు వేసి ఉంచాలని వాగ్మారే సుభాష్ కోరారు. ఈ మేరకు ఆదివారం అంబేద్కర్ విగ్రహంపై దుమ్ము ధూళి పడి ఎంతో వేరుగా కనిపిస్తుంటే విగ్రహాన్ని కడిగి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి, వర్ధంతి రోజు మాత్రమే నివాళులర్పిస్తున్నామని.. కానీ ఇప్పటి నుంచి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న అంబేద్కర్ విగ్రహాలను ప్రతి ఆదివారం నీటితో కడిగి పూలమాల వేసి ఘన నివాళులర్పించాలని పిలుపునిచ్చారు.

బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శిగా గుంజల నాగభూషణం



నియామకపత్రం అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-నవీపేట్

బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శిగా మండలంలోని నందిగాం గ్రామానికి చెందిన గుంజల నాగభూషణంను ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు శివప్రసాద్ బోధన్ నియోజకవర్గ నాయకులు మోహన్‌రెడ్డి సమక్షంలో జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను నిస్వార్థంతో, నిజాయితీగా పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బందేల ఆనంద్ రామకృష్ణ, రాజేందర్ గౌడ్, రాము, రమణారావు, భాను గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పనిగట్టుకుని ఆరోపణలు చేస్తున్న బీజేపీ

- ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మోపాల్ : అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే



నిజామాబాద్ రూరల్ పరిధిలో..

నవతెలంగాణ-మోపాల్/నిజామాబాద్ రూరల్

బీజేపీ నాయకులు బీఆర్ఎస్ ప్రభుత్వంపై పనిగట్టుకుని ఆరోపణలు చేస్తున్నారని ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. ఆదివారం మోపాల్ మండలంలోని నిజామాబాద్ నగర పాలక సంస్థలో విలీనమైన బోర్గాం (పి)లో ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సీసీ రోడ్డు, డ్రయినేజీలు, బీటీ రోడ్డు, సెంట్రల్ మీడియం, లైటింగ్, బ్రిడ్జి నిర్మాణానికి టీయూ ఎఫ్ ఐడీసీ రూ.4కోట్ల 45 లక్షల నిధులతో వివిధ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోర్గం గ్రామ ప్రజలు స్థానిక ఎలక్షన్‌లో నన్ను గెలిపించిన మున్సిపల్ కార్పొరేషన్ ఎలక్షన్లో మాత్రం బీఆర్ఎస్ అభ్యర్థిని ఓడించారని, ఆ విషయంలో తాను బాధపడకుండా బోర్గంకు కావాల్సినన్ని నిధులు మంజూరు చేస్తూనే ఉన్నానని తెలిపారు. కానీ కొందరు బీజేపీ నాయకులు అదే పని పట్టుకొని ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అనుక్షణం విమర్శలు చేస్తున్నారని తెలిపారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నల్లధనం తెస్తానన్న ప్రధానమంత్రి ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా నల్లధనం తీసుకురాలేదని, బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎంతమంది రైతుబంధు, రైతుబీమా, వృద్ధాప్య పింఛన్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ అందిస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. పసుపు బోర్డు తెస్తానన్న ఎంపీ అరవింద్ మాటమార్చారని తెలిపారు. అలాగే తన తండ్రి రాజ్యసభ ఎంపీగా ఉన్నా. సంవత్సరానికి రూ.5కోట్ల నిధులు ఉన్నా కూడా ఒక్క రూపాయి కూడా జిల్లా కోసం ఖర్చు చేయలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నారని తెలిపారు. తండ్రీ కొడుకులు కేవలం విమర్శించడానికి సరిపోతారే తప్ప ఒక్క రూపాయి కూడా ఉపయోగ ఉపయోగపడే పనులు చేయలేదని ఆయన తెలియజేశారు. మహారాష్ట్ర ప్రజలు కూడా కేసీఆర్ లాంటి మహనీయుడిలా రాష్ట్రానికి సీఎం కావాలని వారికి కూడా రైతుబంధు, రైతుబీమా లాంటివి కావాలని వారు అడుగుతున్నారని ఇప్పటికి మూడు సభలకు ప్రజలు గణనీయమైన స్పందన వచ్చిందని తెలిపారు. తాను ఎమ్మెల్యే అయినప్పటినుంచి నిజామాబాద్ రూరల్ ప్రజలకు రూ.20 కోట్ల మేరకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద అందజేశానని తెలిపారు. అలాగే ఎంపీ పీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఎంతమందికి సాయం అందజేశారో చెప్పాలని ప్రశ్నించారు. మోడీ ప్రధానమంత్రి అయిన తర్వాత ఏ ఒక్క పని కూడా జరగలేదని కేవలం మాటలకే పరిమితమవుతున్నాడని ఇటువంటి చేతగాని ప్రధానమంత్రి తన రాజకీయ జీవితంలో ఎప్పుడూ చూడలేనని అన్నారు. బీజేపీ ప్రభుత్వం ఎనిమిది రాష్ట్రాల్లో కూలగొట్టి తమ ప్రభుత్వాధిపత్యం చెలాయిస్తుందని ఇలాంటి పద్ధతులు మానుకోవాలని ప్రజాస్వామ్యబద్ధంగా ఉండాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు సంజీవరెడ్డి, జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, బోర్గం సొసైటీ చైర్మన్, డీసీసీ బ్యాంక్ ఎస్.చంద్రశేఖర్ రెడ్డి, నుడా డైరెక్టర్ అభిలాష్ రెడ్డి, ఈగ శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్ సౌజన్య, నిజామాబాద్ రూరల్ జెడ్పీటీసీ సుమలత గోపాల్ రెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు గోపాల్ నాయక్, వివిధ గ్రామాల సర్పంచులు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన బాజిరెడ్డి..

నిజామాబాద్ రూరల్ : అలాగే నిజామాబాద్ నగరపాలక సంస్థలో విలీన గ్రామాలైన కాలూర్, ఖానాపూర్ గ్రామాలకు చెందిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ గ్రామీణ శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్, జిల్లా యువ నాయకుడు జిల్లా పరిషత్ ఆర్థిక ప్రణాళిక సంఘ సభ్యులు, ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్మోహన్ పాల్గొని శంకుస్థాపన చేశారు. కాలూర్ నుంచి జన్నేపల్లి రోడ్డు వరకు శంఖుస్థాపన చేశారు. కాలూర్‌లోని వివిధ ప్రాంతాలలో సి.సి. రోడ్లు, సి.సి. డ్రెయిన్లు, బి.టి. రోడ్లు, వార్డు కార్యాలయం, దోభి ఘాట్, ప్రహరీగోడల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కాలూర్ రోడ్డు నుంచి ఖానాపూర్ గ్రామపంచాయతీ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి, అలాగే ఖానాపూర్‌లోని సి.సి.రోడ్లు, సీసీ డ్రెయిన్లు, వైకుంఠ ధామం, బి.టి.రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే సారంగపూర్లోని వివిధ ప్రాంతాలలో సీసీ రోడ్లు, బి.టి. రోడ్ల నిర్మాణానికి సైతం శంకుస్థాపన చేశారు. అలాగే నాలుగవ డివిజన్ పరిధిలో బ్యాంకు కాలనీ రోడ్డు నెంబర్ 4లో రూ.5 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మీసాల మధుకర్, సొసైటీ చైర్మన్ నాగేశ్వర్ రావు, 4వ డివిజన్ అధ్యక్షులు నాగళ్ళ శ్రీకాంత్, బీసీ విభాగం అధ్యక్షులు మల్లెపూల నరసింహచారీ, మహిళ మండలి అధ్యక్షురాలు శిల్ప, డివిజన్‌లోని వివిధ కాలనీల అధ్యక్ష, కార్యదర్శులు, పార్టీ అనుబంధ శాఖల నాయకులు, పార్టీ మీడియా ప్రతినిధి మల్లెపూల నవీన్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, కాలనీవాసులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఈటల రాజేందర్ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-బోధన్

తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ చేసిన ఆరోపణలకు నిరసనగా ఆదివారం యువజన కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఈటల రాజేందర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రేవంత్ రెడ్డిపై ఈటల చేసిన ఆరోపణలను నిరూపించాలని, వారి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని కోరారు. అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. ఈ ఆరోపణలు నిరాధారమైనవి కనుక ఈటల వెంటనే రేవంత్‌రెడ్డికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని లేని ఎడల యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో అడుగడుగునా అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో యువజన కార్యదర్శి దొడ్ల రవీందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రెసిడెంట్ షేక్ ఫరాక్, యువజన కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తల్లారి నవీన్, మైనారిటీ జిల్లా అధ్యక్షులు, కార్యదర్శి సాజిద్ బడు, ఇనాయత్ అలీ, యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ జీవన్ గౌడ్, యూత్ కాంగ్రెస్ ఎడపల్లి వైస్ ప్రెసిడెంట్ రంజిత్, అధ్యక్షులు అనిల్, రిజ్వాన్, ఆర్.నవీన్, శంకర్, సాయిలు, ఆమీన్, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల జయంతి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-కోటగిరి

ఈనెల 30న బోధన్ అంబేద్కర్ చౌరస్తాలో మహనీయుల జయంతి ఉత్సవాన్ని జయప్రదం చేయాలని ఆదివారం వాల్‌పోస్టర్లను బీఎస్పీ నాయకులు న్యాయవాది ఈశ్వర్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి బహుజనులు పెద్ద మొత్తంలో హాజరై జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో బి.ఎస్.పి బోధన్ నియోజకవర్గ కన్వీనర్ పాండు, నాయకులు పరిమి కోటేశ్వరరావు, ఇందుర్ సాయి, గులాబ్, చేతన్ నగర్ యువకులు, తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల జీవిత చరిత్ర పుస్తకాలు అందజేత



పుస్తకాలు అందజేస్తున్న తులసికుమార్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని సామాజిక సేవకులు పట్వారి తులసి కుమార్ ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణ గ్రంథాలయంలో గల పాఠకులకు, విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరమయ్యే పాఠ్యపుస్తకాలు, మహనీయుల జీవిత చరిత్ర అంశాల పుస్తకాలు, తెలుగు, ఇంగ్లీష్ డిక్షనరీలు, భగవద్గీత వంటి పుస్తకాలను గ్రంథాలయంలో చదివే పాఠకులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అజ్ఞానం అనే చీకటిలో నుంచి జ్ఞానమనే దీపములా వెలుగును నింపేది పుస్తకమని తెలిపారు. తన విద్యార్థి దశ నుంచి ఉన్నత స్థాయి వరకు పుస్తకం ఒక స్నేహితుడిగా ఉపయోగపడుతుందని, ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకుని మంచి అలవాట్లు ఆచరణతో దేశ శ్రేయస్సుకు సేవ చేసేలా ఆదర్శవంతుడిగా తీర్చిదిద్దాలని అన్నారు. అదేవిధంగా తెలంగాణలో ఈ పోటీ పరీక్షల సమయంలో ప్రతి గ్రంథాలయంలో అవసరమయ్యే పూర్తి సదుపాయాలు సమకూర్చాలని ప్రభుత్వానికి వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఇంచార్జ్ వరలక్ష్మి, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

- జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విట్టల్‌రావు, నగర మేయర్ దండు నీతూకిరణ్
- ఘనంగా మహాత్మా బసవేశ్వర జయంతి



మాట్లాడుతున్న జెడ్పీచైర్మెన్ విఠల్‌రావు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విట్టల్‌రావు, నగర మేయర్ దండు నీతూకిరణ్ అన్నారు. శ్రీ మహాత్మా బసవేశ్వర జయంతి ఉత్సవాలను ఆదివారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ఈ వేడుకలకు అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా అధ్యక్షత వహించగా, జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విట్టల్‌రావు, నగర మేయర్ దండు నీతూకిరణ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి, మహాత్మా బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్, మేయర్ మాట్లాడుతూ, మహనీయులను స్మరించుకుంటూ వారి స్ఫూర్తితో ముందుకు సాగేందుకు వీలుగా తెలంగాణ ప్రభుత్వం మహనీయుల జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తోందని అన్నారు. మహనీయులను స్మరించుకోవడం ద్వారా ప్రేరణ లభించి సమాజం సంస్కరించబడుతుందనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం మహనీయుల జయంతి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సమాజంలోని రుగ్మతలను పారద్రోలడానికి ఆనాడు కృషిచేసిన మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. కుల, మత, లింగ, వర్గ, వర్ణ భేదాలకు వ్యతిరేకంగా బసవేశ్వర చేసిన కృషి ఎంతో గొప్పదని కొనియాడారు. అందుకే ఆయనను విశ్వ గురువుగా, గొప్ప దార్శనికుడిగా, సంస్కారవాదిగా ప్రపంచం కీర్తిస్తుందని గుర్తు చేశారు. మహనీయుల ఆలోచన విధానాలతో నేడు మనమంతా ముందుకు సాగితే సమాజం సత్వర అభివృద్ధి సాధించేందుకు, సమాజం నుంచి చెడు దూరం అయ్యేందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు. మహనీయుల స్ఫూర్తితో సమాజ హితం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పాటుపడాలని, ఐకమత్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా మాట్లాడుతూ.. వీరశైవ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో కృషి చేస్తామని అన్నారు. మహాత్ముల జయంతి సందర్భాల్లోనే కాకుండా సమస్యలను నిరంతరం గుర్తిస్తూ వాటిని అధికార యంత్రాంగం దృష్టికి తెచ్చి పరిష్కరించుకునేందుకు చొరవ చూపాలని బీ.సీ సంఘాల బాధ్యులకు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారి నర్సయ్య, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, వీరశైవ సమాజ్ బాధ్యులు సిద్ధలింగయ్య స్వామి, శివకుమారప్ప, అజయ్, బాబాయప్ప, బీసీ సంఘాల ప్రతినిధులు నరాల సుధాకర్, బుస్స ఆంజనేయులు, రాజేశ్వర్, షేక్ హుస్సేన్, ఎస్సీ సంఘం నాయకుడు బంగారు సాయిలు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఔరంగాబాద్ ప్రచారంలో పాల్గొన్న నాయకులు



ప్రచారంలో పాల్గొన్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

మహారాష్ట్ర ఔరంగాబాద్ సంబాజీనగర్ జాజిందా మైదానంలో నేడు జరిగే భారీ బహిరంగ సభ ప్రచార కార్యక్రమంలో పట్టణానికి చెందిన కౌన్సిలర్లు, సర్పంచులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను, తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న వాటిని నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు ఆశన్న గారి జీవన్ రెడ్డి చేస్తున్న కృషిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పూజ నరేందర్, పండిత్ ప్రేమ్, కౌన్సిలర్లు ఇట్టెడి నర్సారెడ్డి, ఆకుల రాము, కాశీరాం, రవి గౌడ్, చాలా ప్రసాద్, కాందేష్ శ్రీనివాస్, సుర్బిర్యాల, ఖానాపూర్, మిర్ధాపల్లి, రాంపూర్, కోమన్‌పల్లి గ్రామాల సర్పంచులు సట్లపల్లి సవిత గణేష్, సింగిరెడ్డి మోహన్, మధువర్మ, బంటు దయానంద్, నీరడి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

చరిత్ర అధ్యయనం భవిష్యత్‌కు పునాది

- టీయూ ప్రొ.డా.చందుపట్ల ఆంజనేయులు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఆంజనేయులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

చరిత్ర అధ్యయనం భవిష్యత్‌కు పునాది అని టీయూ ప్రొ.డా.చందుపట్ల ఆంజనేయులు అన్నారు. ఇతిహాస సంకలన సమితి - ఇందూరు ఆధ్వర్యంలో ఆర్య సమాజ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి అవగాహన సదస్సుకు ముఖ్య వక్తగా తెలంగాణ విశ్వ విద్యాలయ ప్రొఫెసర్ డా.చందుపట్ల ఆంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్ర అధ్యయనం వల్లనే భవిష్యత్ తరాలకు మన సాంస్కృతిక వారసత్వం అందుతుందని అన్నారు. చరిత్ర అనేది మన ఇంటినుంచే ప్రారంభమవుతుందని, మన పూర్వీకుల జీవిత విశేషాలను అధ్యయనం చేసి వాటిని గ్రంథస్థం చేసి భావితరాలకు అందించే బాధ్యత మన అందరి మీద ఉందని అన్నారు. అధ్యయనానికి ఏది అనర్హం కాదని మన గ్రామం, దేవాలయం, కట్టు, బొట్టు, ఆచారం, వ్యవహారం తదితర ఎన్నో విషయాల్లో అధ్యయనం ఎంతో అవసరమని సూచించారు. ఇతిహాస సంకలన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కందకుర్తి ఆనంద్ మాట్లాడుతూ ఔత్సాహిక పరిశోధకులకు ఇతిహాస సంకలన సమితి ఒక మంచి వేదిక అని, చరిత్ర అధ్యయన కారులకి ఎల్లవేళలా తాము సహకారాన్ని అందిస్తామని అన్నారు. కేంద్ర ప్రభుత్వ కల్చరల్ మినిస్ట్రీ కమిటీ సభ్యుడు ప్రభాకర్ మాట్లాడుతూ మరుగున పడిపోయిన స్వతంత్ర సమర యోధుల చరిత్ర అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని, అలాంటి వారికి తమ పూర్తి సహకారం ఉంటుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నేషనల్ బుక్ ట్రస్ట్ వారిచే ఎంపిక కాబడిన ఔత్సాహిక చరిత్ర పరిశోధకుడు జ్ఞానేశ్వర్‌ను సంస్థ పెద్దలు సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆకాశవాణి అధికారి మోహన్ దాస్, తపస్ జిల్లా అధ్యక్షురాలు పరలి కృష్ణవేణి, పడిగెల దశరథ్, వెంకట మల్లయ్య, ఆర్య సమాజ్ ప్రతినిధులు ప్రవీణ్ ఆర్య, చౌటి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వీ టీజీసెట్ పరీక్ష ప్రశాంతం



డిచ్‌పల్లి : పరీక్ష రాస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి/ఎడపల్లి

నిజామాబాద్ జిల్లాలోని వివిధ సంక్షేమ గురుకుల పాఠశాలలలో 5వ తరగతిలో ప్రవేశాలకు డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం బి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల (బాలికల) ప్రతిభ పాఠశాల/కళాశాలలో వీ టీజీసెట్-2023 పరీక్షను ఆదివారం నిర్వహించినట్లు చీఫ్ సూపరింటెండెంట్ బి.సంగీత తెలిపారు. ఈ పరీక్షలకు మొత్తం 504 మంది దరఖాస్తు చేసుకోగా 480 మంది (95శాతం) మంది విద్యార్థులు హాజరైనారని, 24 మంది గైర్హాజరు అయ్యారని ఆమె వివరించారు. పరీక్షను కోవిడ్-19 జాగ్రత్తలతో ప్రశాంతంగా ముగిసిందని, ఈ పరీక్ష కేంద్రంలో పరీక్ష సజావుగా నిర్వహించడానికి డిపార్ట్మెంట్ అధికారి యం. శ్రీనివాస్‌ను నియమించినట్లు వివరించారు.

తరలివచ్చిన విద్యార్థులు తల్లిదండ్రులు..

నిజామాబాద్ జిల్లాలోని వివిధ సంక్షేమ గురుకుల పాఠశాలలలో 5వ తరగతిలో ప్రవేశాలకు డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం బి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల (బాలికల) ప్రతిభ పాఠశాల/కళాశాలలో ఆదివారం నిర్వహించిన వీటీజీ సెట్ 2023 ఎంట్రెన్స్ పరీక్ష కేంద్రానికి సమయానికి ముందే విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకుని భారీగా తరలివచ్చారు. పరీక్ష పూర్తయ్యే వరకు అక్కడే ఉండి పరీక్ష పూర్తయ్యాక తమ పిల్లలను తీసుకుని తిరిగి వెళ్లారు. పరీక్ష కేంద్రం లోపలికి ఎవరూ రాకుండా నిజామాబాద్ హైదరాబాద్ రహదారికి ఆనుకుని ఉన్న గురుకుల పాఠశాల గేట్లను మూసివేశారు. కాగా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. త్వరలో ఈ పరీక్షల ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.

ఎడపల్లి : ఎడపల్లి మండల పరిధిలోగల తెలంగాణ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ఐదవ తరగతి అర్హత పరీక్షకు ప్రశాంతంగా నిర్వహించారు. 208 మంది విదార్థినీలు హాజరు కావాల్సి ఉండగా 190 మంది మాత్రమే హాజరు కాగా 18 మంది బాలికలు గైహాజరైనట్లు గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ సుహాసినీరెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రం గేటు వద్ద ఎడపల్లి ఎస్సై పాండేరావు పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్యేను కలిసిన గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు



ఎమ్మెల్యేకు సన్మానిస్తున్న వీడీసీ సభ్యులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని మునిపల్లి గ్రామానికి చెందిన గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా మునిపల్లి గ్రామంలో జరగవలసిన లిఫ్ట్ పనులు, శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయుల అభివృద్ధి పనుల కోసం చర్చించారు. ఎమ్మెల్యే అన్ని సమస్యలపై సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మండల మాజీ ఎంపీపీ సభ్యులు అనంత్ రెడ్డి, మండల వైస్ ఎంపీపీ సభ్యులు ముస్కు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురడిరెడ్డి కళ్యాణ మండపం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి..

మండలంలోని మునిపల్లి గ్రామంలో గురడి రెడ్డి కల్యాణ మండపం నిర్మాణ కొరకు నిధులు మంజూరు చేయాలని గురుడి కాపు కులస్తులు ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి మాజీ ఎంపీపీ అనంతరెడ్డి తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను పూలతో శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సభ్యులు అనంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్ నియోజకవర్గ ఇంచార్జ్‌గా రామర్తి గోపి



నవతెలంగాణ-కంఠేశ్వర్

ఉదయపూర్ నవసంకల్ప శిబిర్ కాంగ్రెస్ ప్లీనరీ సమావేశంలో తీర్మానం ప్రకారం కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో రిజర్వుడ్ నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి ఎల్‌డీఎంఆర్‌సీ (లీడర్షిప్ మిషన్ ఫర్ రిజర్వ్ కాన్స్టెన్సీ) ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చేరువ కావడానికి స్థానిక నాయకత్వాన్ని బలపరుస్తూ భవిషత్ తరాలకు కొత్త నాయకత్వాన్ని పెంపొందించే కార్యాచరణ దిశగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ విభాగంలో ఎనలేని సేవలను అందిస్తున్న యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామర్తి గోపిని జుక్కల్ నియోజకవర్గ ఇంచార్జ్‌గా నియమించారు. ఈ సందర్భంగా రామర్తి గోపి మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తనవంతుగా సేవలను అందించే అవకాశం కల్పించినందుకు జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేకి, భావి భారత ప్రధాని రాహుల్ గాంధీకి, తెలంగాణ రాష్ట్ర ప్రధాత సోనియా గాంధీకి, జాతీయ నాయకులు కొప్పుల రాజుకు, ఎస్‌సీ సెల్ జాతీయ అధ్యక్షులు రాజేష్‌కు, ఎల్‌డీఎంఆర్‌సీ జాతీయ సమన్వయకర్త పులి అనిల్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. జుక్కల్ నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ కార్యాచరణ మొదలుపెట్టి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక పాలన వైఖరిని వివరిస్తామని తెలిపారు.